# లీల

మీరా కే ప్రభు! గిరిధర నాగర
చరణ కమలబల విహారీ ...
తుమబిన మేరీ కౌనకబరలే ...

పాట వినిపించే వంకతో మర్త్యులకు కూడా అమృతదానం చేయడానికి మోహిని అవతరించిందేమో ననుకున్నాను. నిజంగా "మీరా" మాత్రం అంతకన్న చక్కగా పాడి ఉంటుందా?

అప్పటికి వారం రోజులునించీ చూస్తూన్నాను. పాట వింటున్నాను. కాని శరజ్జీమూతాల మాటున మణగిపోయిన విద్యుల్లతను పోల్చుకోవడం ఓ పట్టున సాధ్యం అయింది కాదు. దూరాన్నుంచి గమనిస్తూ ఎవరో సామాన్య భిక్షకులే అయి ఉంటారని అనుకున్నాను. విశిష్ట లక్షణాలేమీ గోచరించకపోవడంచేత.

నడివీధిలో నిలుచుని పంచమశ్రుతిలో పాడుతుంది. ఆమె ప్రక్కనున్న అంధ యువకుడు తంబూరా మీటుతున్నాడు: అర్ధనిమీలిత నేత్రాలతో, ఆ పారవశ్యాన్ని అనుభవిస్తూ ఆమె గానం చేస్తూంటే, అప్పటి ఆమె మూర్తి చాలా రమణీయంగా ఉంది. వంగీయ శిల్పి రతిమోహన్‌వసు చిత్రించిన 'కుణాల్ కాంచనమాల'కు వీరేనేమో లక్ష్యమనిపించింది.

మెసలడానికి వీలులేకుండా చుట్టు జనం కమ్మేశారు. ఆమె ఎన్నోమార్లు ముందుకు సాగడానికి యత్నం చేసింది. ఎవరూ వత్తిగిలలేదు. చిరునవ్వుతో, దయ వెల్లి విరుస్తున్న నేత్రాలతో అందరినీ కలయఁజూసి తిరుగ పాడటం మొదలుపెట్టింది. అరగంట – గంట – ఎంతసేపో, ఎవరికీ తెలియలేదు. సమ్మోహితులై అందరూ బాహ్యస్మృతి లేకుండా, ఏ జగత్తులలోనో విహరిస్తున్నారు. ఆమె దయతలచి అప్పటికి ఆపివేసింది. అందరు ఒకమారు తలలూపి, విడిపోయినారు.

చూపు మరల్చుకునేందుకైనా నాకు శక్తి లేకపోయింది. ఱెప్ప వేయకుండా ఆమెవంకే చూస్తూ అక్కడనే నిలవబడి పోయినాను. చూసినకొద్దీ నాకు ఆశ్చర్యం వేసింది. అన్ని ఉత్తమ లక్షణాలున్న ఆ పిల్లకూ, ఆ యువకుడికీ అలాంటి స్థితి ఎందుకు వచ్చిందా, అని.

ఏమన్నా యిద్దామా, వద్దా, అనే చికిత్సలో ఉండగానే, వాళ్ళిద్దరూ అక్కడనుంచి వెళ్ళిపోయినారు. ఎందుచేతనో కాని, చూసినకొద్దీ ఇంకా చూడాలనే అనిపించింది. వాళ్ళెవరో, ఏ దేశమో సంగతులన్నీ కనుక్కుంటే గాని తోచేటట్టు లేదు. కాఫీకూడా పుచ్చుకోకుండా వారి వెనుకనే బయలుదేరాను.

తిన్నగా ఊరికి చివరనున్న ధర్మశాల దగ్గరకుఁ జేరుకున్నారు వారి రువురూనూ. అక్కడ అదివరకే ఉన్న వాళ్ళందరూ లేచి నిలుచుని నమస్కరించారు. ఆమె

చిరునవ్వుతో వారి నందరినీ సత్కరించి, ఆ యువకుణ్ణి లోపలికి తీసుకుని పోయింది.

ఆమె తిరిగి వచ్చేలోగా, బయట నున్న వాళ్ళందరూ వరుసతీరి నిలుచున్నారు. మెట్లమీద నిలుచున్న వారందరికీ డబ్బులు పంచిపెట్టడం మొదలు పెట్టింది. అందరూ పుచ్చుకోగా మిగిలినవి మరీ వృద్ధుడూ, అశక్తుడూగా ఉన్న ఒకడికి యిచ్చివేసింది. ఆమెవద్ద డబ్బులన్ని అయిపోయినాయి. అందరూ వెళ్ళిపోయినారు. నేను మాత్రం మిగిలినాను.

'అమ్మా, ఆయనను చూడటానికి వీలుంటుందా?' అని హిందీలో అడిగాను ఆమెను.

ఒక నిమేసం నన్ను నిదానించి చూసి, 'దయచేయండి' అని అన్నది చక్కని తెలుగులో. నేను తెల్లపోయినాను. ఆమె పాట విన్నప్పటినుండీ, వారిద్దరూ తెలుగువారు కాకూడదా అనే ఆలోచనే లేకుండా బోయింది. అప్పటికి తెప్పరిల్లాను.

లోపలికి తీసుకుని వెళ్ళింది. నేను గుమ్మందగ్గర నిలబడినాను. గదిలో తెల్లని దుప్పటి వేసిన మంచంమీద ఆ యువకుడు విశ్రమించి ఉన్నాడు. ఆమె అతన్ని సమీపిస్తూండగానే ఆ సవ్వడి నానవాలువట్టి 'ఇందూ' అన్నాడు.

అతని తల నిమిరి 'రాజా! ఎవరో వచ్చారు. కూర్చుని కొంచెంసేపు మాట్లాడుతావా?' అని అడిగింది.

అతను ఏమి చెప్పలేదు. కొంచెంసేపటికి ఆమె 'మాట్లాడుదూ, నీ కోసం వచ్చారు' అన్నది. అతడు లేచి కూర్చుని, 'కూర్చోమను' అన్నాడు. నేను అప్పటికే సుఖంగా ఆసీనుణ్నై ఉన్నాను చాపమీద. అతడు అది గ్రహించాడు చెప్పకుండానే.

'మీరెవరూ? – ఎందుకు వచ్చారూ? – నాతో మీకేం పని?' – అని ఆ చూపు తొలగిపోయినచూపు నన్ను ప్రశ్నించడం మొదలుపెట్టింది. నే నది అర్థము చేసుకుని,

'అయ్యా! నే నెవరినో, ఎలాటివాడినో, చూసి పోల్చుకునేందుకు మీకు నేత్రములు లేవు – తెలియజెప్పకునేందుకు తగినంత అర్హత నాకు లేదు. మిమ్ములను చూసినప్పటినుంచి, మీరెవరో, సామాన్యులు కారని తోచింది. మీకీ స్థితి తగినది కాదని తెలిసి, మీ వృత్తాంతము తెలుసుకోవాలని కుతూహలం కలిగింది. ఈ సోదరుడికి మీ సంగతి తెలియఁజేయడానికి అభ్యంతరం లేకపోతే – ధన్యుణ్ణవుతాను' అని చాలా వినయంగా, గౌరవంగా అడిగాను.

అతని మొగములో నవ్వు కనిపించింది.

'మీరెవరో అమాయకులుగా ఉన్నారు – మేమూ సామాన్యులమే. మీరు భ్రాంతిపడి ఉంటారు' అన్నాడు.

'క్షమించండి – మీ మాట విన్న తరువాత కూడా, మీరు సామాన్యులనే అమాయికత్వం అంత ప్రశంసనీయం కాదనుకుంటాను. మీ విషయ మేమిటో కథలాగా విని ఆనందించి పోదామని రాలేదు. ఎందుచేతనో, మీతో మాట్లాడితే బాగుండు ననిపించింది: అంతే.'

'మమ్మల్ని చూసి జాలిపడి ఉంటారు.'

'లేదు విచారపడ్డాను, మీకీ స్థితి తగినది కాదని.'

'మాకిది అనుభవయోగ్యంగానే ఉన్నది.'

'దాన్ని నిర్ణయించడానికి నేను తగను. అర్థమైనది మాత్రం కాదు.'

'ఆ నిర్ణయానికి మీకు యోగ్యత?'

'స్నేహ భావమే.'

అతనేదో చాలాసేపు ఆలోచించాడు. చివరకి, నమ్మకం ప్రకటిస్తున్న గొంతుతో, 'మా వృత్తాంతం వినడానికి చాలా చిత్రంగానే ఉంటుంది. నాకు సంబంధించినంత వరకూ కథ నేను చెపుతాను: ఇంతలో స్నానంచేసి వస్తుంది ఇందు – మిగతాది ఆమె చెబుతుంది – మా సంగతి ఎవరికీ చెప్పకూడదు – అసలు ఎవరికి కావాలి – అనుకున్నాం మొదట – మీకే మొదటిసారి – ఆఖరుసారి కూడాను – చెప్పడం – ఇది రహస్యమని నేను వేరే మనవి చేయనక్కరలేదు కాదూ.'

'మహాప్రసాద'మని నేను మనసులో అనుకున్నాను.

'అసలు కథకు ముందు, మా యిద్దర్నీ గూర్చి కొంచెం చెప్పాలి.'

'నాపేరు రాజేశ్వర ప్రసాద్. ఆ అమ్మాయి ఇందుమతి. నేను బ్రాహ్మణుణ్ణి, ఆమె తల్లి వేశ్య.

మా ఊరిపేరూ, బంధువులపేర్లూ చెప్పను. కథ విన్న తరువాత అవి అనవసరమని మీకే తెలుస్తుంది.

రెండేళ్ళనాటి సంగతి – అప్పుడు నేను బి.యే. చదువుతూండేవాడిని: తల్లిదండ్రులకు చిన్ననాడే మొగం వాచాను. మా మేనమామే నాకు విద్యాబుద్ధులు చెప్పిస్తూ, ఎంతో ప్రేమతో పెంచాడు. ఆయన చాలా భాగ్యవంతుడు. మొగపిల్లలు ఎవరూ లేరు. నాతో యీడు జోడుగా మెదిగా వాణి అనే కూతురు తప్ప. ఆ పిల్లకు నేనంటే చాలా ఆపేక్ష. దైవం అన్యధాగా విధించకపోతే, ఈపాటికి మేనల్లుడినే కాకుండా అల్లుణ్ణి కూడా అయేవాడిని మా మామయ్యకు.

ఒళ్ళూ, పై తెలియని వయస్సులో ఉన్నాను. తాపత్రయా లేమిలేవు: కనుసన్నలలో మెలగుతూ, ఏ పని కావలెనన్నా చేసే స్నేహితు లుండేవారు. చాలా చక్కని వాడినని, కలవాడినని, అందరూ చాలా గౌరవంతో చూసేవారు ఆ రోజుల్లో, ఎవరినీ లెక్కచేయకుండా తిరిగేవాణ్ణి.

మే మా సంవత్సరం మృచ్ఛకటిక చదవాల్సి వచ్చింది. చెప్పే శాస్త్రుర్లుగారు మంచి రసికుడు. ఆయన పాఠం వింటూంటే కుర్రవాళ్ళందరూ మైమరచి పోయేవారు; అనేక ఆలోచనలు పోయేవి; ప్రతివాడూ – అందరి సంగతీ ఎందుకూ – నాకు మాత్రం వసంతసేన మీదనే ఉండేది ధ్యానం అంతా. అలాటి నాయిక లభించడానికి చారుదత్తుడు ఎంత పుణ్యం చేశాడో ననిపించేది. లేకపోతే సామాన్యులందరికీ ఆ భాగ్యమబ్బుతుందా?

ఆనాడు చాలా ఆలస్యంగా బయలుదేరాను కాలేజీకి. సగం త్రోవలో, మబ్బన్నా లేకుండానే అమాంతం వర్షం పట్టుకుంది; నేను ముందరికి సాగడానికి వీలులేక పోయింది ఆ కుంభవృష్టిలో; అందుచేత అక్కడే ఆగిపోయి, ఆ పంచనే వాన తగలనిచోట నిలుచున్నాను.

ఎదురుగుండా మేడమీదనుంచి ఇందుమతి నన్ను కనిపెట్టింది; నేను ఆమెను చూశాను; యెన్నడూ మాట్లాడకపోయినా, నిదానించి ఆమె చక్కదనాన్ని చూడకపోయినా, అప్పుడు ఎంతోకాలంనుంచి యెరుగున్నదానిలాగా కనిపించింది; నేను వణుకుతూ, ఆమెవైపే చూస్తూ అక్కడే నిలుచున్నాను.

ఆమె కనబడకుండా లోపలికి వెళ్ళిపోయింది; అంతవరకూ తెలియకుండా పోయిన చలి, ఇనుమడించిన ఆవేశంతో నన్నావరించింది; అలా అవస్థపడుతూ అక్కడ ఎంతసేపు నిలుచున్నానో;

వీధి తలుపు తెరుచుకుని ఇందు గుమ్మం ఈవల నిలువబడినది; ఆమె చూపులోనే ఆహ్వానాన్ని గ్రహించి, నేను ఒళ్ళు మరచిపోయి, సైకిలు నెట్టుకుంటూ ఆమె యింటి వైపుకు జేరుకుని, మెట్లెక్కి ఆమె వద్దకు పోయినాను; అంతకు ముందెన్నడైనా ఆమె పిలిచినా ఆ వైపైనా చూసేవాడిని కానేమో! కాని అప్పుడు వేరే ధోరణే లేదు.

'లోపలికి రం'డని చాలా మర్యాదగా పిలిచింది ఇందు. నేను వెనుక ముందు చూడకుండా ఆమె వెంట లోపలికి వెళ్ళిపోయినాను;

ఆమె గదిలోకి తీసుకుని వెళ్ళి సోఫామీద కూర్చోబెట్టింది; తడి బట్టలన్నీ తీసివేసి, సిల్కు వస్త్రం నడుముకు చుట్టుకుని, ఆమె యిచ్చిన శాలువ కప్పుకుని కూర్చున్నాను.

'వస్తున్నా'నని ఇందు గదివిడిచి వెళ్ళింది; మరి అయిదు నిముషాలలో ఆమె తల్లివచ్చి కాఫీసామాను టీపాయిమీద అమర్చి, నావంక తమాషాగా చూసి, మాట్లాడకుండానే వెళ్ళిపోయింది.

ఇందు వేషం మార్చి వచ్చింది; ముందుకన్నా అప్పుడు మరీ అందంగా ఉంది; నాకు కాఫీ కలిపి యిచ్చి, తానుకూడా నా సరసను కూర్చుని త్రావింది.

'నేను వెళ్ళివస్తాను. మీ ఆదరణకు చాలా –' అని మనసులో యిష్టం లేకపోయినా, మర్యాదకోసం బలవంతాన అంటూ, లేచి నిలుచున్నాను. ఇందు సవిలాసంగా చిరునవ్వుతో.

'వెళ్ళడానికి వీలులేదు, మళ్ళా వాన వస్తూంది' అన్నది. నిజమే ముసురు పట్టింది. అప్పట్లో వాన వదిలేటట్టు లేదు – నే నింటికి వెళ్ళేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలయింది.

అయిదారు నెలలు గడచిపోయినాయి రెక్కలు గట్టుకుని; అంతవరకూ మా స్నేహం సంగతి తెలియదు; ఆఖరికి నా అంతరంగిక మిత్రులకు కూడా చెప్పనేలేదు. ఇందు తల్లి సాని అయినా, ఎవరినో ఒకరినే నమ్ముకుని, అతన్నే నాశనం చేసి అర్జన చేసింది; అందుచేత నలుగురు వచ్చే యిల్లు కూడా కాదది;

పాపమో పుణ్యమో బయటపడక మానదు యెన్నటికైనా. ఒనాడు రాత్రి, నేను వాళ్ళ యింట్లోనుంచి బయటకు వచ్చేటప్పటికి మా మామయ్య తారసిల్లాడు; నేను ఆయన్ని చూడనట్లుగా దాటిపోయినాను; ఆయనకూడా నన్ను పలుకరించలేదు.

వారం రోజులు ఆయన కంటబడలేదు; ఇందును కూడ చూడటానికి వెళ్ళలేదు;

చివర కోనాడు మనసు పట్టలేక ఆ వీధినే వెళ్ళాను. మేడ మీదనుంచి ఇందు కనబడ్డది; నేనిక ఆలోచించకుండా లోపలికి పరుగెత్తాను.

మేడ మెట్లమీద నుంచి యెగిరివచ్చి నా కౌగిలిలో వాలింది ఇందు. నలిగిపోయి, చిక్కినట్లుగా కనుపించింది; కావ్యాలలో కనుపించే ప్రోషితభర్తృక మాదిరిగా ఉంది.

నన్ను పలుకరించలేదు. నేనూ మాట్లాడించలేదు. ఆమె కన్నీటితో నా ఛాతీ అంతా తడిసిపోయిన తరువాత గాని నాకు సరిగా అర్థమయింది కాదు ఆమె ఆవేదన;

యిన్నినాళ్ళనుంచి యెందుకు రాలేదని అడుగనన్నా లేదు; నిష్ఠూరోక్తు లాడలేదు; కాని, ఆనాడు మాత్రం మామూలు కన్న యెక్కువ కులాసాగా సంతోషంగా కనిపించింది; నేను ఆవేళ చాలా ప్రొద్దుపోయి యింటికి వెళ్ళాను.

మా మామ కుర్చీలో పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు; నేనాయనను పలుకరించకుండానే హాలులో దుస్తులు విడిచి, పట్టుబట్ట కట్టుకుని లోపలికి భోజనానికి పోయినాను;

భోజనం సగ మయేసరికి ఆయన వచ్చి నాకెదురుగా కూర్చున్నాడు. నేను భయపడుతూ తలవంచుకొని కూర్చున్నాను;

'నాయనా, ఇంత ఆలస్య మయిందేమి ఇవాళ' అన్నాడు నిమ్మళంగా;

'ఏమీ లేదూ, ఊరికేనే' అని తప్పించుకోవాలని చూశాను;

'ముహూర్తం స్థిరపరిచాము. వచ్చే ఆదివారం నీ వివాహం – నీ స్నేహితు లందరినీ పిలు –'

నేను తెల్లబోయినాను. అప్పటికి పెండ్లిచేసుకోవాలన్న ఆలోచనే లేదు. మా వాళ్ళకు ఆ ఉద్దేశం ఉన్నట్లు తెలియనే తెలియదు;

'వధువు ఎవరు?' అన్నాను ఉద్వేగాన్ని ఏలాగో అణచుకుంటూ.

ఆయన నవ్వాడు.

'నీవు కోరుకున్నదే – వాణి'

నే నేమీ మాట్లాడలేదు. చప్ప చప్పన భోజనం ముగించి లేచాను. సావడిలో నాకోసం ఎదురు కాచుకుని కూర్చున్నాడు మా మామయ్య నేను వెళ్ళగానే.

'ఏమంటావు?' అని అడిగాడు. ఈసారి కాస్త కోపంగానే.

'ఏ మంటే మాత్రం లాభం ఏముంది – ఇప్పుడు వద్దు'

'తప్పదు – పెద్దవాడిని నాకెదురు చెపుతావా – అష్టకష్టాలు పడి నిన్ను పెంచి పెద్దవాడిని చేశాను; నిన్ను ఒక యింటివాడినిగా చేద్దా మని ఉంది – నీవు అడ్డు చెప్పవద్దు.'

'బలవంతాన ఒప్పిస్తావా!'

'నీకు వివేక ముంటే బలవంత మెందుకూ – లక్షణవతియైన పిల్లను నీకిచ్చి పెండ్లి చేస్తానన్నాను – నిన్నేమీ కాని పనికి ఒప్పుకో మనడం లేదే.'

'మామయ్యా! నన్ను పెంచినందుకు కృతజ్ఞుణ్ణో, కానో మీకు తెలుసును: కాని యీ విషయంలో మాత్రం నీ కడ్డు చెప్పక తప్పదు. ప్రస్తుతం ఆ మాట తలపెట్టవద్దు.'

'ఎందుచేత?'

'కారణ ముంది.'

'నాకు తెలుసును. ఆ కారణమే నేనింత తొందర పడటానికి కారణము.'

'తెలిసిఉండి కూడా నన్ను నిర్బంధించడ మెందుకూ?'

'నీవు కానిపని చేయడమో.'

'పెద్దవాడవు. నీతో వృధాగా వాగ్వాదము చేయను. కాని దయయుంచి యీ విషయంలో మాత్రం నా యిష్టం వచ్చినట్లు పోనీయి – ఇది నా మనవి.'

'చేసుకోక తప్పదు – ఇది నా శాసనం'

'ఉల్లంఘన చేయాల్సి వస్తుంది – క్షమించు.'

'ఇక నుంచి నా యెదుటికి రావద్దు.'

చాలా కోపంతో లోపలికి వెళ్ళి ఫెళ్ళున తలుపు వేసుకున్నాడు: నేను కుర్చీలో కూలబడి ఆలోచించడం మొదలు పెట్టాను: ఇందును మరచిపోవడం – మరచిపోగలనా? వాణిని పెండ్లాడటమా?

పంచ భూతములూ సాక్షులుగా, గాంధర్వ విధిని ఇందును పరిణయమైనాను. ఈ జన్మకు ఆమెయే నాకు భార్య.

ఈ నిశ్చయం నాకెంతో సంతోషంగా ఉంది: ఇందు వద్దకు వెంటనే వెళ్ళి సంగతంతా ఆమెకు చెప్పివేసినాను. ఆమె విని ఊరకున్నది. చిన్నబోయినట్లుగా కూడా కనబడ్డది.

చాలా రోజులదాక ఇందు అలాగే ఉండేది. పరధ్యానంగా – ఏదో ఆలోచిస్తున్నదాని లాగా – మనసులో ఏమున్నదో నాకు తెలియదు. అడిగినా చెప్పదని ఊరుకునేవాడిని.

ఆమె వదన కమలము భాష్పకలుషితమైతే, ఈ దీనుడు సహించ లేకపోయేవాడు. ఆమె మనసులో బాధ ఏమో కనుక్కొని నివారణ చేయవలెనని ఉన్నా, ఇందు మనసిచ్చి చెప్పలేదు. ఆమె విచారంగా ఉండటం చూసి నేను క్రుంగిపోయేవాడిని.

అలాగే చాలారోజులు విచారంలో, సంతోషంతో గడచిపోయినాయి.

ఇందు పుట్టినరోజు – నే నెంత సంతోషంగా ఉన్నానో, ఆమె కూడా విచారాన్నంతా మరచిపోయి నాతో బాటు కులాసాగా – గడిపింది, మధ్యాహ్నమంతా వీణె వాయించింది ఇందు. సాయంకాలము ఫలాహారము చేసి, ఇందు నోటి కందించిన ఆకు చిలకలు నములుతూ, యింటికి వెళ్ళాను. కాని, అక్కడ ఒక నిమిషం ఉండ మనసొప్పింది కాదు. భోజనమైన చేయకుండానే తిరిగి వచ్చేశాను.

ఇందు చక్కగా అలంకరించుకొని నా రాక కెదురు చూస్తున్నది. కను మూసి తెరచేటంతలో కనుమూయకుండా రాత్రి గడచిపోయింది.

నిద్ర లేచాను. అంతా చీకటిగా ఉన్నది. చాలా చోద్యమనిపించింది. తెల్లగా తెలవారిన తరువాతనే కనుమూశానే? రోజంతా నిద్ర పోయి ఉంటానా! ... ఏమో–

అంత చీకటిపడినా దీపా లేమీ వెలిగించలేదు. నిప్పు పెట్టె కోసం వెదికాను చేత్తో. కనపడినది, గీశాను. వెలుగలేదు. అది పారవేసి మరొకటి గీద్దా మనుకుంటున్నాను – చేయి చట్టున కాలింది, పుల్ల వెలుగుతూనే ఉంది!

కలవర పడిపోయినాను. చాలా భయం వేసింది. 'ఇందూ' అని బిగ్గరగా పిలిచాను. 'లేచారా' అంటూ, ఇందు నా దగ్గరికి వచ్చిన సడి వినపడ్డది, ఇందు కనబడలేదు.

నిద్ర మేల్కొంచేటప్పటికి అంధుణ్ణయినాను.

ఆ తరువాత ఇక మాట్లాడలేకపోయినాడు. కళ్ళవెంట జలజల బాష్పాలు కురిసినాయి. ఎంత దాచుకున్నా దాగని ఆ విచారాన్ని అతని నిట్టూర్పులు వ్యక్తపరచినాయి. ఉద్వేగమై పొంగి పొరలి వచ్చే శోకప్రవాహాన్ని అతని ధీరత్వమెంతోసేపు అరికట్టలేకపోయింది.

'ఊరుకోవడం ఉత్తమం' అనే మహావాక్యాన్ని జ్ఞాపకం చేసుకుని, నేను కదలకుండా, మెదలకుండా కూర్చున్నాను; అనునయించటమల్లా అతన్ని మరీ బాధించడమే కదా అని.

ఉద్వేగాన్ని శాంతింప జేసుకొని తనంతట తానే దిటవు తెచ్చుకున్నాడు, కొంచెం సేపటికి. కాని రుద్ధకంఠంతోనే,

'ఇందూ – ఆమె పేరు ఉచ్ఛరించడానికి, ఆమెను నాది అనుకోడానికి ఎంత పుణ్యం చేశానో? నా అంత అదృష్టవంతులు లేరండి – నిజంగా నే నామెను పొందడానికి అర్హుణ్ణే అవుదునో, కానో అనేమో ఈ పరీక్షలన్నీ కూడాను' అన్నాడు.

అతనికి అప్యాయంగా ఉండేటట్టు జవాబు చెప్పడానికి నాకు ఆ పట్టున భావమూ, భాష కూడా స్ఫురించలేదు. మౌనముద్ర విడువకుండానే, ఆ ధీరుడి శాంత గంభీర వదనాన్ని తనివిదీరా చూస్తూన్నాను.

'ఠపీ' మని దెబ్బ, దా న్ననుసరించి ఆర్తనాదం వినపడ్డాయి. మే మిద్దరమూ ఉలికిపడ్డాము. నేను లేచి పరుగెత్తుకుంటూ బయటికి వచ్చాను.

మెట్లమీద ఇందుమతి నిలుచున్నది. షోకైన బత్తరి తలకట్టు – తడి ఆరక పోవడంచేత సంజె కాంతిలో మెరుస్తూ, మొఖమల్ కుచ్చులులాగా, వీపంతా కమ్మేసి, సీలమండల దాకా ప్రాకుతోంది. కోపంతో తల విసి రేటప్పటికి మయూర పింఛం మాదిరిగా అమరింది. పిడికిలి సారిస్తూ చూపులతో శాపాగ్ని ప్రజ్వరిల్లచేస్తూ, నరకుడిమీదికి దూకడానికి సిద్ధపడుతూన్న సత్యభామవలె ఉంది.

మెట్లక్రింద, కటిక నేలమీద – చెప్పడానికి చాలా కష్ట మనిపిస్తూంది. నే నెరిగున్న ఒక కులీనుడు, యౌవనుడు పడి వున్నాడు.

నన్ను చూడగానే ఆమె కొంత వెనుకకు తగ్గింది – అతడు చూసి చూడనట్లుగా – ఆ పరాభవాన్ని మరచిపోయినట్లుగా, లేచి వెనుదిరిగి నడచిపోయినాడు.

కనబడకుండా పోయేదాకా, మే మిరువురమూ ఆవైపే చూస్తూ నిలుచున్నాము.

ఆమె నవ్వింది.

'అమ్మా! ఏమిటి – ఏం జరిగింది' అని నేను చాలా ఆదుర్దాతో ప్రశ్నించాను.

'ఎబ్బే ఏమీ లేదండి – అత నెవరో – చదువంతా ఇందాకనుంచి నావద్ద ఏకరువు పెడుతున్నాడు – చివరకు విని – విని – అతని పలువరుస బాగుండలేదని...'

'మంచి పని చేశారు బుద్ధి వచ్చేటట్టు...'

స్తోత్రం చేయడం మొదలు పెడుతున్నా ననుకున్నదేమో, ఇందుమతి నా మాటకు అడ్డము వచ్చి,

'ఓహో - చూడనే లేదే - అనుకుంటూనే ఉన్నానులెండి - అనురాగమని - అవ్యాజ ప్రేమ అని ఇంకా ఏవో చాలా మాటలు ప్రయోగించాడు. ఆ మాటలు వింటూ నా చేయి కూడా ...'

అప్పటికి సరిగా అర్థం చేసుకున్నాను - ఆమె చేయంతా నెత్తురు చిందులున్నాయి.

'రాగరంజిత మయింది - సరే నేనూ అనురాగవతినే కాదూ - పూర్వం రాజ పుత్రాంగనలు వీరతిలకం పెట్టుకోవడం ఈలాటప్పుడే సంభవించేదట కాదూ ...'

ఆమె అమాయకపు శౌర్యం చూసి నే నాశ్చర్యపడిపోయినాను. ఈలా కనబడకుండా మనవాళ్ళలో కూడా ఎంతమంది వీరనారు లున్నారో!

'అబ్బ! ఎంత స్వచ్ఛంగా ఉందండీ అతని అనురాగం - అతని మనస్సు కూడా అలాగే ఉంటే ఎంత బాగుండేదీ ...'

ఆమెకు అది అంతా నవ్వులాటగా ఉంది. తప్పు చేసిన కుమారుణ్ణి గట్టిగా మందలించి మనస్సులో కోపం ఉంచుకోని తల్లిలాగా మాట్లాడుతూంది.

'మీరు లోపలికి పోయి కూర్చోండి - నేను చేయి కడుక్కుని వస్తాను. యెండిపోతే వదలనని పట్టుబడుతుందేమో' -

నే నొక దేవతామూర్తి సాన్నిధ్య మందున్నట్లు భావించుకున్నాను. అప్పుడు తెలిసింది. దేవతలుకూడా కష్టాలనుభవించా రనడం ఏమిటో, నిజమో - కాదో!

లోపల కూర్చున్నాను. ఆలస్యం లేకుండా ఇందుమతి కూడా నావెంటనే వచ్చేసింది. తిన్నగా అతని దగ్గరకు వెళ్ళి ప్రక్కను కూర్చుని 'రాజా!' అన్నది గాద్గదికంతో.

'ఊఁ...'

'అనుకున్నంతా...'

ఆ పైన మాటలు చెప్పలేక అతని భుజం చాటున తల దాచుకుని దుఃఖించడం మొదలు పెట్టింది.

అతడు చలించలేదు. మెడ నెమ్మదిగా పైకి చాపి -

'ప్రభూ! నీ దయ ...' అని నిట్టూర్పు విడిచాడు.

ఆమె వెంటనే కుదుటపడి లేచి నిలుచున్నది.

కన్నీటి చారికలు తప్ప మొగాన శోక చిహ్నాలన్నీ సాపుగా మాయమయినాయి.

'అయ్యో! క్షమించండి - మీ రున్నారని కూడా మరచి పోయినాను - స్త్రీ జనానికి సహజమే కాదండీ - అధీర ని ఊరికే అనలేదు మన పెద్దలు.'

'మిమ్మల్ని చూసిన తరువాత నాకు ఆ మాటలమీద విశ్వాసం పోతుంది.'

'దయచేసి - పొగడ బోకండి - నన్ను నేను నిదానంగా చూసుకోవడం మొదలు పెట్టిన తరువాత - అవన్నీ వేద వాక్యాలని నమ్మకం కుదురుతూంది.'

'ఇందూ! వారు పెద్దలు, వాదించకూడదు.'

నేను మాటకు అడ్డంవచ్చి 'కాదని' మళ్ళా వాదన మొదలుపెడుదా మనుకుంటున్నాను – అతడు ధోరణి మార్చకుండానే.

'– నావంతు కథ నేను చెప్పాను. నీకు తెలిసిందంతా నీవు జెప్పాలి – మన కథ; నిన్ను కనుక్కోకుండానే నీ బదులు కూడా నేనే ఒప్పుకున్నాను –'

'ధన్యురాల నయినాను – రాజా – నాకు నీవేకాదూ సర్వమున్నూ – నన్ను వేరే అడగాలా?'

చీకటి పడింది. ఎక్కడో దూరాన మినుకు మని చిన్న దీపం మెరుస్తోంది. మే మున్నచోట దీపం లేదు, ఇందుమతి వెలిగించనూ లేదు.

'ఏమీ అనుకోకుండా, ఎక్కడన్నా సందేహము ఉంటే అడగండి ... మీకు వినిపించడం, మీరు వినడం కూడా మా అదృష్టమే కావచ్చును. 'సరే' నని తల ఊపాను.

'నాకు అప్పటికింకా చాలా చిన్నతనం –

మా యింటికి సమీపంలో మాధవరం రాజాగారి తోట ఉండేది – ఉంది ఇప్పటికి కూడాను – దాంట్లో చాలా నెమళ్ళను పెంచేవారు. అవి ప్రొద్దునా, సాయంకాలం, చుట్టుపక్కల మేడల మీదికి ఎక్కి, లే ఎండలో నాట్యం చేస్తుండేవి. మేఘ గర్జన వినగానే గుంపులుగా వీధివెంబడి ఒళ్ళు తెలియకుండా, పురి విప్పుకుని గంతులు వేస్తూ పరుగులెత్తేవి: ... చిన్న పిల్లలందరూ, అవి వెళ్ళిపోగానే రాలిన ఈకలు యేరి తెచ్చుకునేవాళ్ళు. ఆనాడు – నేను ఎప్పటి లాగానే పరుగెత్తుకుంటూ వచ్చాను యింట్లోంచి, నెమలికన్ను కోసం. కాని, నాకంటే ముందరగా అప్పుడే ఓ అబ్బాయి అన్నీ యేరేశాడు. అక్కడ ఒకటన్నా లేదు.

అతను చాలా బాగున్నాడు. అన్ని రంగులూ ఉన్న నెమలి ఈకల కన్న – ఒక్క రంగుతో – పచ్చగా ఆ పిల్లవాడే మెరసిపోతున్నాడు. అతని చేతిలో నెమలి కన్నులమీదుగా, అతని కన్నుల వంక ఓరగా చూస్తూ నిలుచున్నాను.

ఎవరో ఎరుగను. కాని నాకు రావలసిన కన్నులన్నీ అతను తీసుకున్నాడని ఉడికిలాను. చిన్నతనం, సిగ్గూ కూడాను. కాసినన్నా నా కిస్తాడేమో ననుకున్నాను. అడుగుదా మనుకున్నాను – కాని సిగ్గు.

తనంతనే నాకో చక్కని కన్ను – ఉన్నవాటన్నింటిలోంచి ఏరి – ఇచ్చాడు – ఆ కన్నులతో నావంక ఓమారు చాలా తమాషగా చూసి వెళ్ళిపోయినాడు.

అప్పుడే మరిచిపోయి ఉంటాడు ఆ సంగతంతా. కాని నాకు మాత్రం అన్నిటి ముందరా ఆ అబ్బాయే జ్ఞాపకం వచ్చేవాడు. చదువుకునేందుకు పుస్తకం తెరిచినప్పుడల్లా ఆ నెమలికన్ను, పట్టు పేలికలలో నుంచి తళుక్కుమనేది – నెమలి కన్నును చూడగానే ఆ – ఆ తమాషా కళ్ళు – జ్ఞాపకం వచ్చేవి.

చాలా రోజులు జరిగిపోయినాయి. రెమ్మలన్నీ రాలిపోయిన నెమలి కన్ను పట్టునంతా తినేసి పూత పట్టింది – నేనూ పెద్దదాన్నయినాను.

మళ్ళా ఎప్పుడూ కనబడలేదు – ఆ అబ్బాయి – అప్పటికి అతనుకూడా పెద్దవాడయి ఉంటాడు – మునపటికన్న కొంచెం యెదిగి ఉండచ్చు – లేత మీసాలు వస్తూంటాయి కూడాను – ఎప్పుడూ అలా, అతన్ని తలుచుకోవడమే

ఆ ఆలోచనలే – పవలు కనబడకపోయినా, కనుమూయగానే కలకలలాడే ఆ నవ్వు మొగం కనబడేది.

'– మామూలు వేళకే కాఫీ త్రాగి చదువుకుందామని కూర్చున్నాను ఆ ఉదయం; పుస్తకం చేత పట్టకముందే వర్షం ప్రారంభించింది; పది బంతులు చదివే టప్పటికే – చాలా జోరుగా కురుస్తూంది – ఆ మోతలో చదువుకోవడం బాగుంది కాదు; పుస్తకం మూసేసి కిటికీలో నుంచి బయటికి చూస్తూ నిలుచున్నాను.

'చువ్వలగుండా మొగం మీదికి జల్లు కొడుతూంది. కిటికీ తలుపులు వేసి – ముందు వరండాలోకి ఉన్న తలుపు తీశాను.'

'వత్సేశ్వరః కుసుమచాప ఇవా ఖ్యపైతి – అప్పుడే చదివాను, అందుచేత ఆ పాదం స్ఫురణకు వచ్చింది'–

ఎదురుగుండా, చూరు క్రిందగా, ఒదిగి తడుస్తూ – ఆ – పిల్లవాడు నిలుచున్నాడు.

చూడగానే పోల్చుకున్నాను. అతను తలయెత్తి నావంక చూసేటప్పటికి – ఇక పరవశనై – గబగబ క్రిందకు పరుగెత్తుకుని వచ్చేశాను.

మేడమెట్లు దిగేటప్పటికి ముందున్న ఆవేశం తగ్గిపోయింది. చాలా సిగ్గువేసింది – ముందుకు వెళ్ళలేక నిలబడిపోయినాను. కాని కొంత సేపటికి – నేను ప్రేమించి, మన సారా వరించిన – ఆ అతడు వానలో తడిసి పోతున్నాడని స్ఫురించగానే, వెనుకా ముందూ చూడకుండా, బయటికి వచ్చేశాను.

నేను పిలువలేదు – పిలువలేక పోయినాను; కాని, నా మనోగత భావాన్ని – ఎలాగో – గ్రహించి అతడే దయచేశాడు నన్ను అనుగ్రహించడానికి;

☆ ☆ ☆

నాలు గయిదు నెలలు రెక్కలు గట్టుకొని, చూస్తూండగానే యెగిరిపోయినాయి; రాజూ, నేనూ ఒక క్షణమయినా యెడబాయలేక పోయేవాళ్ళం – ఆ రోజులన్నీ కను మూసి తెరచేలోగా గడచిపోయినాయి.

పంచమి పండు వెన్నెల్లో రాజూ, నేనూ కూర్చున్నాం తోటలో; మల్లెపొద విరబూసింది. రాజు దొంతర మల్లెలన్నీ కోసుకుని వచ్చి పాలరాతి చెక్కామీద కుప్పగా బోసి, నా సరసను కూర్చొని, దండ గ్రుచ్చుతున్నాడు.

జడ కనబడకుండా కోసుకొచ్చినవన్ని తల్లో అమర్చేశాడు; కలకల్లాడే చంద్రుణ్ని చూసి నా తల్లో మల్లెలన్నీ నవ్వినాయి – నా రాజును చూసి నేనుకూడా నవ్వాను – ఉహుఁ – 'మళ్ళా ఒకమారు' – అని కొసరి కొసరి నవ్వించాడు నన్ను రాజు.

... అతని కౌగిటిలో అణగిపోయి, కరువుదీరా ఆ ముద్దుమొగాన్ని చూస్తూ ... ఏ లోకాల్లోనో విహరిస్తున్నాను – ఈ భావనలో అమాంతంగా 'అమ్మాయీ!' అని ప్రక్కనుంచి పిలుపు వినబడ్డది – దాని వెంటనే మా అమ్మ ప్రత్యక్షమయింది.

మమ్మల్ని చూసి చప్పున వెనుకకు తగ్గి – 'పొరబాటు – మీరిక్కడ –' అంటూ యేమిటో తడబడ్డది. నేను 'వస్తున్నా'నని రాజును మొగమాట పరచి కౌగిలిలోంచి తప్పించుకుని ఆమె దగ్గరకు వెళ్ళాను; ... 'అమ్మా! ఓమారు లోపలికి

వస్తావా' అన్నది. అది విని, 'ఇందూ – నేనింటికి వెళ్ళుతున్నాను' అని రాజు వెళ్ళిపోయినాడు.

మా సంభాషణను వివరించలేను – నన్ను రాజుతో చెలిమి మానేయమని మా అమ్మ చాలా గట్టిగా చెప్పింది.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మొదట రాజు తనకు అల్లుడయినాడని మురిసిన మా అమ్మ, అలా మారిపోవడం యెందుచేతనో నాకేమీ అర్థం కాలేదు. అప్పుడు నేనేమీ జవాబు చెప్పలేదు. కాని, నా ధోరణిని బట్టి ఆమె నా అభిప్రాయ మేమేమో గ్రహించే ఉంటుంది.

రోజులు నెమ్మదిగా గడవటం మొదలుపెట్టినాయి, మా అమ్మ ఆనాటి కానాడు మరీ కఠినంగా మాట్లాడటం సాగించింది. రాజును చూడకుండా – రాజును తలవకుండా – రాజు పేరెత్తకుండా – ఇక రాజు మాట మరచిపోయి – యెవరో – యెవరో ఒకాయన ధనాన్ని వరించమని!

నన్నంత కష్ట పెట్టడం కన్న గొంతు నులిమి పారేస్తే యెంత బాగుండేది. కన్నతల్లి – యెన్నెన్ని మాటలన్నదీ! – 'ఆయనకేం, రేపీ పాటికి చక్కగా పెండ్లి చేసుకుని సుఖంగా ఉంటాడు.' ఎల్లకాలమూ, అన్నమాట అనకుండా కంటబడినపుడల్లా సాధించేది –

నేను, నా కాతడు శాశ్వతమనే నమ్మి, అతని తోడిదే లోకమని భావించుకుం టున్నాను. వేరు చింత లేదు. రాజు – నా రాజు – పెండ్లి చేసుకుంటాడా? – ఎవరిని?

ఎవరితో చెప్పనూ? – అప్పు లెవరూ లేరు. రాజుతో సరే – అసలు ఆ మాట యెత్తడానికే వీలులేదు కదా! అతన్ని కూడా కష్టపెట్టనా. ఈ మాటలన్నీ చెప్పి? – యెంత వేదన పడుతున్నా అతను కంట బడేటప్పటికి బాధలన్నీ మాయమయేవి. రాజు విచార పడుతూంటే చూడగలనా?

ఒక్కొక్కనాడు చాలా భయం వేసేది. రాజు కాస్త ఆలస్యంగా వస్తే యిక రాడేమో; మా అమ్మ అతన్ని నొప్పిస్తే విరక్తి పుట్టి వెళ్ళిపోయినా డేమో అని చాలా దిగులుగా ఉండేది. అతన్ని చూడకపోతే – అతను రాకపోతే – యెవరికోసం, ఎందుకు బ్రతకడం?

నా పుట్టినరోజు నాలుగురోజు లుండనగానే మా అమ్మ నన్ను నిష్ఠురా లాడటం మానేసింది. వెనుకటికన్నా ఎక్కువ ఆపేక్షపడటం మొదలు పెట్టింది. – నా అంత అదృష్టవంతురాలు ఇంకొకతె ఉంటుందా అనిపించింది – ఆ సంతోషంలో –

ఆవాళ నన్ను విడచి వెళ్ళనే లేదు – మా అమ్మ వారినికూడా చాలా గౌరవించింది. చాలా – చాలా సంతోషంగా గడిపాం ఆ రోజు.

ఇందుమతి గొంతులో గాద్గదికం కనిపించింది, కళ్ళ నీరు కమ్మింది.

అంతే – ఆ పాపిష్టివేళ – ఆవేళతో రాజుకు సూర్యచంద్రులు లేకుండ బోయినారు.

నేను చాలా కలవర పడిపోయినాను. కాని, ఒంటరిదాన్ని యేమి చేయగలను, నేనుకూడా అధైర్యపడితే రాజు మరీ క్రుంగిపోతాడని, నేను కుమిలిపోతూ, అతనికి ధైర్యం చెపుతూ కూర్చున్నాను.

వారి మేనమామకు కబురంపాను. ఆయన వచ్చి రాజును తీసుకుని వెళ్ళి చికిత్స చేయిస్తాడు గదా అని సంతోషించాను. కాని, విధి ప్రతికూలుడైనాడు. 'చేసుకున్నంతా అనుభవించక తప్పదు' అని ఆయన కబురుమాత్రం పంపేడు, వచ్చి చూడనన్నా లేదు.

రాజు నేను చెప్పకుండానే ఎలాగో ఆ సంగతి తెలుసుకున్నాడు – చాలా విచారపడ్డాను. తానేం జేశాడని తనకాశిక్ష?

ఎవరికీ తన సంగతి తెలియనీయ వద్దన్నాడు. కాని, దాగుతుందా? స్నేహితులందరూ వచ్చారు. రాజు కన్న – అసలు – రాజు అధైర్యపడనే లేదు. ఎక్కువగా విలపించారు. అందరికీ చాలా వింతగా ఉంది. రాత్రి చక్కగా నిద్రపోయినవాడు మేల్కొంచేటప్పటికి దృష్టి లేకుండా పోవడం – చాలా చిత్రమనిపించింది.

అయిదు రోజులు యుగాలకన్నా మందగతితో జరిగినాయి. వైద్యుడు వచ్చి నిదానించి నిత్యమూ పరీక్షచేసి ఏదో ఇచ్చిపోతున్నాడు. కాని, ముఖలక్షణాల్ని బట్టి రోగనిదానం ఆయనకు గూడ అంతు చిక్కలేదని స్పష్టమయింది.

ఆయన మన యింట్లో ఉండటానికి వల్లకాదు – వాళ్ళ యింటికి వెళ్ళిపొమ్మని చెప్పమని నన్ను చురచుర చూస్తూ ఆజ్ఞాపించింది మా అమ్మ.

నేనామె కాళ్ళంటి బ్రతిమాలుకున్నాను – ఆయనను విడిచి బ్రదుకలే నన్నాను – నాకే అలాటి స్థితి వస్తే జాలిదలచవా అన్నాను – నామీద ఏమైనా ప్రేమ ఉంటే ఆయనను కూడా ఉండనీయ మన్నాను.

ఆమె వల్లకా దన్నది. నేను ఒళ్ళు మరచి ఆమెపై తిరుగబడినాను. అతనితోబాటు నేనూ వెళ్ళిపోతానన్నాను: – ఇంకా ఏమేమో చాలా అన్నాను – ఆమె నాకన్న ఎక్కువగా కేకలు వేసింది – మేము ఎంత త్వరగా ఇంట్లోంచి నడిస్తే అంత మంచిది – తక్షణం పొమ్మన్నది.

ఆమె నన్ను తూలనాడుతూ, ఆ ఆవేశంలో తాను చేసిన – ఆ ఘనకార్యాన్ని బయటపెట్టింది. రాజుకు – మా అమ్మ ఔషధోపచారం చేత – కళ్ళు లేకుండా బోయినాయి – మనసు విరవాలని పెట్టిన మందు – ఆ మాదిరిగా పరిణమించింది.

మా – రాజు మేనమామ చాలావరకు దీనంతటికీ కారకుడని తరువాత తెలిసింది – తన కుమార్తె నిచ్చి రాజుకు పెండ్లి చేయాలని, మా అమ్మను ప్రోత్సహించి, మాటలచేత కాదని మందులలోకి దిగి – చివరకు ఇంత పని చేశాడు. నన్ను కటుపారా కన్న – ఆ – ఏమంటేమాత్రం ఏం లాభం – ఆ సద్బ్రాహ్మణుడి మాటలు విని నా కాపురాన్ని సట్టేట కూలద్రోసింది.

☆ ☆ ☆

మా అమ్మ నా - రాజు మనసు విరవాలనుకుంది కాయా – నామేని చాయ నేను విరుచుకున్నాను. అతనికి కాని అందం ఎందుకూ?

ఎవరితోనూ చెప్పలేదు – ఎక్కడికి వెళ్ళామో – ఏమయినామో, ఎవరికీ తెలియదు – ఇద్దరం బయులుదేరాము. తీర్థాలన్నీ సేవించుకుని – తిరిగి వెళ్ళిపోతున్నాం యింటికి – ఒక నెల్లాళ్ళలో జేరుకుంటాము.

మా పుణ్యం మంచిది – మహానుభావు డొకడు తటస్థించి రాజుకు తగి. చికిత్స చేశాడు. మేము మా ఊరు వెళ్ళేటప్పటికి రాజు మళ్ళా కులాసాగా ఉంటాడు, – ఆ చక్కని కళ్ళతో నన్ను ...'

మాట పూర్తి చేయలేక పోయింది, అప్పటి సంతోషాన్ని తలుచుకుంటూ.

కథ చాలించింది. అందరమూ కొంచెంసేపు మాట్లాడకుండా కూర్చున్నాము.

'సెలవు తీసుకుంటాను – సుదినం, మిమ్మల్ని దర్శించడం కలిగింది' ...

అని లేచి నిలుచున్నాను. అయనకూడా లేచాడు. 'ఎంతమాటా? – నిజంగా మా అదృష్టమే, మీరు మమ్మల్ని వెతుక్కుంటూ రావడం – వెళ్ళివస్తారా? – మా కథలో చాలా భాగాలు వదలివేసి ముఖ్యాంశాలు మాత్రం చెప్పాము నేనూ, ఇందూను. మిగతావి మీరు ఊహించుకోవలసిందే.'

'నా దొక మనవి ఉంది.'

'తమ రలా అనరాదు – అజ్ఞాపించండి.'

'అన్యథాగా భావించక – తాము స్వస్థత జెందేవరకూ ఈ సోదరుడి అతిథ్యాన్ని స్వీకరించమని – ప్రార్థన.'

'తమ సౌహార్ద్రానికి – నమస్కారాలు – కాని, క్షమించండి – మాకు నియమముంది; అందుచేత మీ మాటకు కాదనవలసి వస్తుంది – ఉదయం ఇక్కడనుంచి వెళ్ళిపోతాము.'

'నా దురదృష్టము.'

'మీరు వేరేలా గనుకోవద్దు – మిమ్మల్ని అప్తకోటిలోని వార్నిగా ఎంచుకున్నాము...'

'సరే – నే నేమీ అనలేను. సెలవా? మరి తిరిగి ఎప్పుడు కనబడుతారో?'

'మాటల ధోరణిని మరచి పోయినాను – మీ చిరునామా ఇప్పించండి. ఉత్తరం వ్రాస్తాను, అప్పుడు మీరు తప్పకుండా ... వచ్చి మమ్మల్ని చూచిపోవాలి.'

'ఓ అవశ్యం.'

'మా ఈ దీక్ష చెల్లిన తరువాత ఇందును నేను యథావిధిగా వివా...'

ఇందుమతి అతన్ని వారించింది; అతడు నవ్వాడు.

వారిచేత ననిపించుకుని, ఆ ప్రేమ మూర్తులను ఆశీర్వదించి నేను తిరిగి వచ్చేశాను.

★ ★ ★